వెన్నుపూస గజగజ



విశ్వేశ్వరయ్య సర్కిల్‌లో చెరిగిపోయిన జీబ్రా లైన్లు

- నగరంలో ఇష్టారాజ్యంగా స్పీడ్ బ్రేకర్లు
- వేగ నిరోధకాల వద్ద కనిపించని జీబ్రా లైన్లు
- ఎక్కడా కనిపించని సూచికల బోర్డులు
- తరచూ ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు



ఆసుపత్రి ఎంట్రన్స్ గేట్ వద్ద వెలసిన స్పీడ్‌బ్రేకర్లు



రాజ్‌విహార్ సర్కిల్‌లో వద్ద తుడిచిపెట్టుకుపోయిన జీబ్రా లైన్స్

కర్నూలు: నగర రహదారులపై ఇష్టారీతిన స్పీడ్ బ్రేకర్ల (వేగ నిరోధకాలు) పేరుతో చేపడుతున్న నిర్మాణాలతో వెన్నుపూసలు కదులుతున్నాయి. అడ్డదిడ్డంగా అనుమతి లేకుండా, అశాస్త్రీయంగా వెలుస్తూ ప్రజలను మంచం పట్టిస్తున్నాయి. నగరంలోని ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లలో ఎక్కడికక్కడ ఎత్తుగా వేసిన స్పీడ్ బ్రేకర్లు గర్భిణులు, బాలింతలకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్ శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. నగర వ్యాప్తంగా ప్రధాన రహదారులతో పాటు కాలనీల్లో పిల్లలు, వృద్ధులు, అటూ ఇటూ తిరిగే రహదారులపై వాహనాలకు వేగనియంత్రణ అవసరమే. పాఠశాలలు, ఆసుపత్రుల సమీపంలో వేగానికి కళ్లెం వేయాల్సిందే. అలాగని ఇష్టారాజ్యంగా స్పీడ్ బ్రేకర్లు నిర్మించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పదేపదే వీటిపై నుంచి ద్విచక్ర వాహనాలు వెళ్లాల్సి వస్తుండటంతో వెన్నెముక, మెడ భాగాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కొన్ని చోట్ల స్పీడ్ బ్రేకర్లు రాత్రికి రాత్రే వెలుస్తున్నాయి. వీటిని గమనించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

చెక్‌పోస్టు నుంచి చౌరస్తా వరకు

నగరంలోని నంద్యాల చెక్‌పోస్టు నుంచి ప్రభుత్వాసుపత్రి, రాజ్‌విహార్ మీదుగా బళ్లారి చౌరస్తా మార్గంలో ఇరవైకి పైగా స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయి. అలాగే మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్ నుంచి బుధవారపేట మీదుగా హంద్రీ బ్రిడ్జిపై నుంచి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే మార్గంలో 50కి పైగా స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయి. ఐదు రోడ్ల కూడలి నుంచి సుంకేసుల రోడ్డులోని రైల్వే వంతెన వరకు సుమారుగా 18 స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయి. ఆయా మార్గాల్లో పదుల సంఖ్యలో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు ఉన్నాయి. ఆయా ఆసుపత్రులకు నిత్యం వందలాది మంది గర్భిణులు, బాలింతలు, వృద్ధులు రాకపోకలు సాగిస్తుంటారు. ఆటోలతో పాటు ద్విచక్ర వాహనాలపై వచ్చేవారికి ప్రత్యక్ష నరకం కనిపిస్తోంది. అధికారులు ఎత్తును తగ్గించి సులువుగా చేస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవని వాహనదారులు అభిప్రాయపడుతున్నారు.

వైద్య విద్యార్థి దుర్మరణంతో....

ఈ ఏడాది జూన్ 9వ తేదీన బుధవారపేట పెట్రోల్ బంకు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వైద్య విద్యార్థి తేజేశ్వరరెడ్డి మృతిచెందాడు. కళాశాల ఆవరణంలో గ్రంథాలయం నుంచి హాస్టల్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. బస్సు వేగంగా వచ్చి ఢీకొట్టడం వల్లే తేజేశ్వరరెడ్డి మృతిచెందారని వైద్య విద్యార్థులంతా ఆందోళనకు దిగారు. దీంతో కళాశాల గేటు వద్ద నుంచి హాస్టల్ గేటు వద్ద వరకు కేవలం అరకిలోమీటరు దూరంలోనే నాలుగు చోట్ల రాత్రికి రాత్రే స్పీడ్ బ్రేకర్లు వెలిశాయి. వైద్య విద్యార్థి సెల్‌ఫోన్ మాట్లాడుతూ బస్సును గమనించకుండా పూర్తిగా కుడివైపు వెళ్లడం వల్లే ప్రమాదం జరిగిందని సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు గుర్తించారు. కానీ వైద్య విద్యార్థులు పట్టుబట్టడంతో అక్కడ అశాస్త్రీయంగా రాత్రికి రాత్రే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో సూచికలు, జీబ్రా లైన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ ఎక్కడా జీబ్రా లైన్లు, సూచికలు కనిపించడం లేదు. అలాగే సిగ్నల్ లైట్ల వద్ద కొన్నేళ్ల క్రితం ఏర్పాటు చేసిన జీబ్రా లైన్లు కూడా తుడిచిపెట్టుకుపోయాయి. కర్నూలు నగరంలో తొమ్మిది చోట్ల సిగ్నల్ లైట్లు ఉండగా, రాజ్‌విహార్, పాత కంట్రోల్ రూమ్ (కోట్ల సర్కిల్) ప్రాంతాల్లో జీబ్రా లైన్స్ లేకపోవడం వల్ల ఆటోమేటిక్ సిగ్నల్ జంపింగ్ ఫైన్లు పడుతుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే స్పీడ్ బ్రేకర్లు ఉన్న ప్రాంతాల్లో జీబ్రా లైన్లు ఏర్పాటు చేయకపోవడం వల్ల వాహనదారులు వేగంగా వచ్చి దగ్గరకు వచ్చి తర్వాత గమనించి బ్రేకులు వేయడం వల్ల అదుపు తప్పి తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రివేళలు, భారీ వర్షాల సమయంలో పూర్తిగా వాటి దగ్గరకు వచ్చేవరకు కనిపించక వాహనదారులు తడబడుతున్నారు.

సూచికల ప్రమాణాలు కనిపించవు

ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ) మార్గదర్శకాల ప్రకారం రోడ్డును తవ్వడం ఎంత నేరమో నిబంధనలు మీరి ఇష్టారాజ్యంగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడం కూడా అంతే తప్పు. నిబంధనల ప్రకారం వేగ నిరోధకం అంటే వేగాన్ని నిరోధించేందుకు రహదారిపై ప్రమాణాలతో చేపట్టే నిర్మాణమే తప్ప అడ్డగోడల కట్టడం కాదు. దీనిని సూచించేలా ఇరువైపులా తెల్లని జీబ్రా గీతలు ఉండాలి. 50 మీటర్ల దూరంలో రెండు వైపులా సూచిక బోర్డులు తప్పనిసరి. నగరంలో ఇలాంటివి ఏ మార్గంలోనూ కనిపించవు. ఎత్తు ఎక్కువగా ఉండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని సుంకేసుల రోడ్డులో స్థానికులే కొన్నింటిని తొలగించారు.

గీతలు లేకపోయే.. జరిమానాలు తప్పవాయే..

నగరంలోని ప్రధాన కూడళ్లలో సిగ్నల్స్ వద్ద జీబ్రా గీతలు లేకపోవడంతో వాహనదారులు పాదచారులకు అవస్థలు తప్పడం లేదు. గీతలు (జీబ్రా లైన్లు) లేకున్నా జరిమానాలు మాత్రం పడుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు.

త్వరలో కార్యాచరణ



నగరంలోని ప్రధాన రహదారుల్లో ఉన్న సిగ్నల్స్, స్పీడ్ బ్రేకర్ల వద్ద జీబ్రా లైన్ల ఏర్పాటుపై నేషనల్ హైవే అధికారులతో చర్చించాం. త్వరలో కార్యాచరణ మొదలవుతుంది. నగరంలో తొమ్మిది చోట్ల సిగ్నల్స్ వ్యవస్థ ఉంది. కోట్ల, రాజ్‌విహార్ సర్కిళ్లలో వాహనదారులు అప్రమత్తంగా వ్యవహరించకపోతే సిగ్నల్ జంపింగ్ ఆటోమేటిక్ జరిమానా పడుతుంది. మిగిలిన ఏడు ప్రాంతాల్లో కూడా ఈ వ్యవస్థ త్వరలో అమలులోకి వస్తుంది.

– మన్సూరుద్దీన్, ట్రాఫిక్ సీఐ

క్లుప్తంగా

లోకాయుక్త జడ్జిని కలిసిన సూపరింటెండెంట్



లోకాయుక్త జడ్జి లక్ష్మణరెడ్డితో సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలులోని ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త జడ్జి పి.లక్ష్మణరెడ్డిని మంగళవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి సంబంధించి పలు విషయాలపై వారు చర్చించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని లక్ష్మణరెడ్డి సూచించారు. ఏఆర్‌ఎంవో డాక్టర్ వెంకటరమణ ఉన్నారు.

పెద్దాసుపత్రికి ఫ్యాన్లు విరాళం



సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డికి ఫ్యాన్లను అందిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజి పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు 50 ఫ్యాన్లు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వారు 50 ఫ్యాన్లను అందించారు. వీటిని మంగళవారం జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా చేతుల మీదుగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఫ్యాన్లను ఆసుపత్రిలోని పలు వార్డులు, కామన్ వెయిటింగ్ హాలులో ఉపయోగించుకుంటామన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ బి.కుమారస్వామిరెడ్డి, సెక్రటరీ డాక్టర్ జి.బాలమద్దయ్య, కోశాధికారి డాక్టర్ ఎం.మహేశ్వరరెడ్డి, డాక్టర్లు ఎ.విక్రమసింహారెడ్డి, ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో చురుకుదనం



టెన్నికాయిట్ పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు

కర్నూలు (టౌన్): క్రీడల వల్ల జ్ఞాపకశక్తితో పాటు చురుకుదనం అలవడుతుందని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, న్యాయవాది జి.శ్రీధర్ రెడ్డి సంయుక్తంగా వెల్లడించారు. మంగళవారం స్థానిక గుడ్ షెపర్డ్ స్కూల్‌లో జిల్లా టెన్నికాయిట్ సబ్ జూనియర్స్ బాల బాలికల ఎంపిక పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను ప్రారంభించిన వారు మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల వైపు ప్రోత్సహించాలన్నారు. జిల్లా టెన్నికాయిట్ కార్యదర్శి రమణ మాట్లాడుతూ టెన్నికాయిట్ ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులు వచ్చే వారం శ్రీకాకుళంలో నిర్వహించనున్న 36వ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ప్రైవేటు వ్యాయామ ఉపాధ్యాయులు సంఘం అధ్యక్షుడు చిన్న సుంకన్న పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ముందుకెళ్దాం

కర్నూలు(అర్బన్): తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ స్ఫూర్తితో సమస్యల సాధన కోసం రజకులు ముందుకు కదలాలని రజక సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు వాడాల నాగరాజు పిలుపునిచ్చారు. మంగళవారం ఐలమ్మ వర్ధంతి సందర్భంగా స్థానిక బీసీ భవన్‌లో ఆమె చిత్ర పటానికి రజక సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ఐలమ్మ వారసులుగా రజకులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. రజక సంఘాల నాయకులు వేంపెంట రాంబాబు, కేతూరి మధు, న్యాయవాది చంద్రశేఖర్, బీసన్న, భారతి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి విరాళం

కర్నూలు కల్చరల్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ తరపున మంగళవారం రూ.5 లక్షలు, జిల్లాలోని 43 సహకార సంఘాల తరపున రూ.4.30 లక్షల చెక్కును విరాళంగా జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్యకు అందజేశారు. కేడీసీసీబీ సీఈఓ విజయ్‌కుమార్, జీఎం రామాంజనేయులు, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, డీసీఓ రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

కర్నూలు (టౌన్): అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని మెప్మా సీఎంఎం మురళీ సూచించారు. మంగళవారం సాయంత్రం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో మదర్ థెరిస్సా టీఎల్‌ఎఫ్ పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. మహిళలకు పౌష్టికాహార వంటలపై పోటీలు నిర్వహించారు. అలాగే ఐదుగురు గర్భిణులకు సీమంతం చేశారు. ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థినికి చేయూత

కర్నూలు కల్చరల్: నిరుపేద విద్యార్థిని ఐఐటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు పేదరికం అడ్డు కారాదని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. మంగళవారం తన చాంబర్‌లో విద్యార్థిని డి.హాసినికి ల్యాప్‌టాప్ అందజేసి ప్రోత్సహించారు. స్థానిక విఠల్ నగర్‌లో నివాసం ఉంటున్న విద్యార్థిని డి.హాసినికి తండ్రి లేరు. తల్లి శారదమ్మ కష్టపడి కూతురును సర్వేపల్లి పాఠశాలలో చదివించింది. 10వ తరగతిలో హాసిని 530/600 మార్కులు, ఇంటర్ మొదటి సంవత్సరంలో 437/470 మార్కులు సాధించింది. ఐఐటీ పరీక్షలకు సిద్ధమవుతున్న హాసినికి ల్యాప్‌టాప్ అందించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ బస్తిపాటి నాగరాజు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఆయన స్పందించి కెనరా బ్యాంక్ ద్వారా సీఎస్ఆర్ నిధులతో ల్యాప్‌టాప్ మంజూరు చేయించారు. మరింత బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ప్రోత్సహించారు. కెనరా బ్యాంక్ రీజినల్ మేనేజర్ సుశాంత్ కుమార్, ఎల్‌డీఎం రామచంద్రరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తులసి దేవి పాల్గొన్నారు.

నేడు హ్యాండ్‌బాల్ పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 11వ తేదీ స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో అంతర్ పాఠశాలల హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి పి.సువర్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6వ తేదీ నిర్వహించాల్సిన ఈ క్రీడలు విద్యార్థులకు పరీక్షల కారణంగా వాయిదా వేసినట్లు తెలిపారు.

నాటుసారా స్థావరాలపై సెబ్ దాడులు

కర్నూలు: స్థానిక బంగారుపేటలోని నాటుసారా స్థావరాలపై సెబ్ అధికారులు దాడులు నిర్వహించారు. సెబ్ సీఐ కేఆర్ రాజేంద్రప్రసాద్, డీటీఎఫ్ సీఐ నరసనాయుడు, ఎస్ఐ మారుతి ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం బంగారుపేట శివారులోని కేసీ కెనాల్ గట్టుపై ఉన్న నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. సారా బట్టీలను ధ్వంసం చేసి దాదాపు 3,400 లీటర్ల బెల్లం ఊటతో పాటు 35 లీటర్ల సారాను ధ్వంసం చేశారు. సారా తయారీకి వినియోగించిన సామగ్రిని స్వాధీనం చేసుకుని, కాలనీలో సారా విక్రయిస్తున్న నీలిషకారి పాతును అదుపులోకి తీసుకుని 10 లీటర్ల నాటుసారాను సీజ్ చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

ఆలోచిస్తే ప్రతి సమస్యకూ పరిష్కారం



సదస్సులో పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి తదితరులు

కర్నూలు(హాస్పిటల్): ప్రతి సమస్యకూ ఒక పరిష్కారం ఉంటుందని, ఒత్తిడికి లోనై ఆత్మహత్యలు చేసుకోవడం సరికాదని కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కర్నూలు మెడికల్ కాలేజీలోని సైకియాట్రి విభాగం ఆధ్వర్యంలో సదరు విభాగాధిపతి డాక్టర్ నాగేశ్వరరావు అధ్యక్షతన కళాశాలలోని నూతన సీఎల్‌జీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. విద్యార్థులు ఒత్తిడికి గురైనప్పుడు కొంత సమయం తీసుకోవాలని, ఇందుకు సైకియాట్రి విభాగం ఎల్లవేళలా సహకారం అందిస్తుందన్నారు. మానసిక వైద్య విభాగాధిపతి డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఒత్తిడిని ఎదుర్కొనేందుకు అనేక మార్గాలు ఉన్నాయని, రోజువారి జీవితంలో మెడిటేషన్, యోగా భాగంగా చేసుకోవాలని సూచించారు. సదస్సులో ఆత్మహత్యల నివారణకు నాటికలు, రీల్స్‌ను నర్సింగ్ విద్యార్థులు ప్రదర్శించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రేణుకదేవి, హెచ్‌ఓడీ మంజులాదేవి, సైకాలజిస్టు చంద్రశేఖర్, మానసిక వైద్యులు, పీజీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

- సమస్యలతో ఒత్తిడికి లోనై తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం పరిష్కారం కాదని కర్నూలు మెడికల్ కాలేజి కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ సుధాకుమారి చెప్పారు. కమ్యూనిటి విభాగం మూడవ సెమిస్టర్ విద్యార్థులకు ఆత్మహత్యల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడికి గురైనప్పుడు ఒంటరిగా ఉండకూడదని, లైఫ్‌స్టైల్ మేనేజ్‌మెంట్, యోగా, మెడిటేషన్, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా ఒత్తిడి జయించవచ్చని చెప్పారు. డాక్టర్లు రవినాయక్ ప్రవీణ, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు సిటీ: బిక్యాంపులోని ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కాలేజీలో.. ఆత్మహత్య ధోరణి, నివారణపై అంతర్జాతీయ ఓమౌజయా యువ చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ రమేష్‌బాబు పాల్గొని ప్రసంగించారు. ఇటీవల యువత చిన్న కారణాలకే ఆత్మహత్య చేసుకుంటున్నారని, సమస్యలు ఉంటే కుటుంబ సభ్యులతో కానీ, స్నేహితులతో చర్చించి పరిష్కరించుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ ఎస్.రంగస్వామి నాయక్ మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు ఆత్మహత్యల నివారణపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



ప్రజా సమస్యల పరిష్కారంపై ఆరా తీస్తున్న మేనేజర్ చిన్నరాముడు

కర్నూలు (టౌన్): సచివాలయాల సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే సహించేది లేదని నగరపాలక మేనేజర్ చిన్నరాముడు హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం స్థానిక రోజా వీధిలోని 99వ సచివాలయం, మునగాలపాడులోని 123, 124వ సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్‌ను పరిశీలించారు. స్థానిక ప్రజల నుంచి రోజువారీగా వచ్చే సమస్యలు ఎన్ని పరిష్కారించారు.. జాప్యానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్ఐ శ్రీకాంత్, సిబ్బంది ఇంతియాజ్ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన కలెక్టర్

కర్నూలు కల్చరల్: రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ఎండీ ఫరూక్‌ను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం స్టేట్ గెస్ట్‌హౌస్‌లో మంత్రిని కలెక్టర్ కలసి పుష్పగుచ్ఛం అందజేశారు.

మొక్కలు నాటి పరిరక్షించాలి



ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్, అధికారులు

కర్నూలు(హాస్పిటల్): ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ స్వచ్ఛమైన గాలి దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజురోజుకూ వాతావరణ కాలుష్యం పెరిగి పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోందన్నారు. దీనివల్ల ప్రజలు వివిధ రోగాల బారిన పడుతున్నారని చెప్పారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని, తద్వారా వాతావరణంలో స్వచ్ఛమైన గాలి పెరిగి ప్రజల ఆరోగ్యానికి దోహదం చేస్తుందన్నారు. పొగలేని వాహనాల వాడకం కాలుష్య నివారణకు దోహదం చేస్తుందని వివరించారు. ఆర్‌బీఎస్‌కే జిల్లా కో-ఆర్డినేటర్ హేమలత, డీపీఎంఓ డాక్టర్ సంధ్య, డెమో శ్రీనివాసులు, డీపీహెచ్ఎన్ఓ ఇందిర, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఎపిడమాలజిస్టు వేణుగోపాల్, హెల్త్ ఎడ్యుకేటర్ పద్మావతి, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్, కమ్యూనిటి మొబిలైజర్ ప్రసాద్, ఆర్‌బీఎస్‌కే కన్సల్టెంట్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు కేటాయించాలి



జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు (టౌన్): జగన్నాథ గట్టు టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాను మర్యాదపూర్వకంగా కలిసి పూలబోకే, శాలువా కప్పి సన్మానించారు. టిడ్కో ఇళ్ల సమస్యను వివరించగా కలెక్టర్ స్పందిస్తూ ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వెంట ఉన్నారు.

వినాయక పూజలో ఎస్వీ కుటుంబం

నగరంలోని రంగారెడ్డి గేట్ వినాయక మండపం వద్ద త్రిశూల్ వినాయక భక్త బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి ఎస్వీ మోహన్ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎస్వీ యూత్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. అలాగే ఇందిరాగాంధీ నగర్‌లో ప్రతిష్ఠించిన వినాయకుడి విగ్రహం వద్ద ఎస్వీ దంపతులు పూజలు చేసి స్థానికులకు అన్నదానం చేశారు. కార్పొరేటర్ మునెమ్మ, నాయకులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడి బాధ్యతల స్వీకరణ

కర్నూలు కల్చరల్: జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షుడిగా పరిగెల మురళీ మంగళవారం డీసీసీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. పునాది లాంటి ప్రతి కార్యకర్తను పార్టీ గుర్తిస్తుందని, కష్టపడే వారికి తప్పకుండా ప్రతిఫలం ఉంటుందన్నారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే తన లక్ష్యమన్నారు.

విశాఖ స్టీల్‌ను ప్రైవేటుపరం చేయొద్దు



రాస్తారోకో నిర్వహిస్తున్న ఏఐటీయూసీ, సీఐటీయూ రైతు సంఘం నాయకులు

కర్నూలు కల్చరల్: విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేసే ఆలోచనను విరమించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప, సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజిబాబు డిమాండ్ చేశారు. కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాల పిలుపు మేరకు మంగళవారం ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో రాజ్‌విహార్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. «విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు» నినాదంతో 32 మంది ప్రాణత్యాగం చేసి స్టీల్ ప్లాంట్‌ను సాధించుకున్నారని, పరిశ్రమ కోసం రైతులు 20 వేల ఎకరాల భూమిని ఇచ్చారన్నారు. ప్రభుత్వం విశాఖ ప్లాంట్‌కు సొంత మైనింగ్ కేటాయించకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేయాల్సివస్తోందని దీని వల్ల నష్టాల పాలవుతున్నట్లు వివరించారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చాక స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయడానికి బీజేపీ కుట్రలు చేస్తోందన్నారు. ఎన్డీఏలో భాగస్వామ్యంగా ఉన్న టీడీపీ కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నగర కార్యదర్శి టి.చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు కృష్ణారెడ్డి, ఈశ్వరరెడ్డి, జయరామిరెడ్డి, నల్లన్న, రేణుక, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల కిట్లు సరఫరా

కర్నూలు కల్చరల్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం 10 వేల నిత్యావసర సరుకుల కిట్లతో వాహనాలు బయలుదేరినట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి జిల్లా టీడీపీ తరపున వరద బాధితుల సహాయార్థం రూ.1.50 కోట్లు విలువ చేసే 10 వేల నిత్యావసర సరుకుల కిట్లతో వాహనాలను ఎస్పీ బిందు మాధవ్‌తో కలిసి కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒక్కో కిట్‌లో ఒక కుటుంబానికి పది రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు ఉన్నాయన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంబాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి తదితరులు పాల్గొన్నారు.



వినాయక పూజలో ఎస్వీ మోహన్‌రెడ్డి దంపతులు








సీతారామ్‌నగర్‌లో అడవి సెట్టింగ్‌లో..., రామలింగేశ్వర్‌నగర్‌లో..., చిత్తారి వీధిలో..

ఉండ్రాళ్లయ్యా.. దీవించయ్యా

కర్నూలు కల్చరల్: నగరంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు కనులపండువలా సాగుతున్నాయి. నాలుగో రోజు మంగళవారం వినాయకుడి మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమాలు, అర్చనలు, సామూహిక కుంకుమార్చనలు, విష్ణు, లలితా సహస్ర పారాయణాలు, భజనలు, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఇన్‌ఛార్జి డీఆర్‌వో చిరంజీవి, రెవెన్యూ అధికారులు కలెక్టరేట్‌లోని పరిపాలనా గణనాథుని పూజల్లో పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి ఓల్డ్‌సిటీలోని రంగారెడ్డి స్ట్రీట్, ఓల్డ్ మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద నిర్వహించిన పూజల్లో పాల్గొని అన్నదానం చేశారు.



మహా గణపతిని దర్శించుకుంటున్న భక్తులు